



ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
# జనం ముచ్చట
బుధవారం, సెప్టెంబర్ 09, 2026 | తెలంగాణ | పేజీలు : 4



# సర్పంచ్ అల్లుడా మజాకా!!

## రచ్చకెక్కిన పువ్వాడ నగర్ అక్రమ ప్లాట్ల వ్యవహారం

**అసైన్డ్ భూమిలో 'ఫేక్ లేఅవుట్'.. వందలాది ప్లాట్ల విక్రయాల ఆరోపణలు...**

**పువ్వాడ ఉదయ్‌నగర్ సర్పంచ్ అల్లుడు ఇస్మాయిల్‌పై బాధితుల తీవ్ర ఆరోపణలు...**

**న్యాయం కోసం వృద్ధ తల్లిదండ్రులతో బాధితురాలి పోరాటం....**

**రఘునాథపాలెం (జనం ముచ్చట):** రఘునాథపాలెం మండలం కోయచలక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 192లో అసైన్డ్ భూములను అక్రమంగా ప్లాట్లుగా విభజించి అమాయకులకు విక్రయించారంటూ తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామ సర్పంచ్ అల్లుడు ఇస్మాయిల్‌తో పాటు మరికొందరు ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూమిగా గుర్తించిన సర్వే నంబర్‌లో నకిలీ లేఅవుట్ మ్యాప్‌ను రూపొందించి, వందలాది ప్లాట్లను విక్రయించారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



2 లో..

## తాత మధు అరెస్టుకు నిరసనగా..

# కదంతొక్కిన మహిళలు

**మధిరలో లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**





2 లో..

**మధిర (జనం ముచ్చట):** కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా మధిర పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఎమ్మెల్సీ తాత మధు అరెస్టును ఖండిస్తూ, అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ జడ్పీ చైర్మన్,బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో బారి ర్యాలీ నిర్వహించారు, పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ప్రశ్నిస్తే అరెస్టులు,నిరసిస్తే దాడులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనా విధానమా అని మహిళలు ప్రశ్నించారు.....

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి సిగ్గుచేటు...**

ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తూ అరెస్టులు, దాడులకు పాల్పడటం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని లింగాల కమల్ రాజు విమర్శించారు.మహిళా శాసనసభ్యులపై దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తోందని ఆరోపించారు. మహిళలపై చేయి చేసుకునే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటని,

# సర్పంచ్ అల్లుడా మజాకా!!

## సర్వే నంబర్ 192లో అక్రమ లేఅవుట్?

బాధితులు చెబుతున్న వివరాల ప్రకారం, కోయచలక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 192/29/2లోని భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్ నంబర్ టీ.26140060631 ఆధారంగా పుల్కం సంపత్ కుమార్, ఇస్మాయిల్ కలిసి అక్రమ లేఅవుట్‌ను సృష్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సదరు భూమి అసైన్డ్ ల్యాండ్‌గా ఉన్నప్పటికీ, దానిని ఇంటి స్థలాలుగా విభజించి పలువురికి విక్రయించినట్లు బాధితులు పేర్కొంటున్నారు. అనుమతులు లేని నకిలీ లేఅవుట్ మ్యాప్‌ను ఉపయోగించి వందలాది ప్లాట్లకు అగ్రిమెంట్లు చేసినట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

అయితే ఈ ఆరోపణలపై రెవెన్యూ శాఖ అధికారులు అధికారికంగా విచారణ జరిపి, భూమి స్వభావం, యాజమాన్య హక్కులు, లేఅవుట్ అనుమతులు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు....




## రూ.2 లక్షలకు 75 గజాల స్థలం విక్రయించారంటున్న బాధితులు...

వైరా పట్టణానికి చెందిన షేక్ హుస్సేన్ బీకి 2023 సంవత్సరంలో 75 గజాల ఇంటి స్థలాన్ని సుమారు రూ.2 లక్షలకు విక్రయించినట్లు బాధితులు తెలిపారు.

ఈ వ్యవహారంలో పుల్కం సంపత్ కుమార్ ద్వారా అగ్రిమెంట్ చేయించడంలో ఇస్మాయిల్ కీలక పాత్ర పోషించాడని వారు ఆరోపిస్తున్నారు. సదరు విక్రయ అగ్రిమెంట్‌లో ఇస్మాయిల్ సాక్షిగా మొదటి సంతకం చేసినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఇస్మాయిల్ ప్రస్తుత గ్రామ సర్పంచ్‌కు అల్లుడు కాగా, పుల్కం సంపత్ కుమార్ గతంలో మాజీ సర్పంచ్‌కు గుమస్తాగా, సన్నిహిత వ్యక్తిగా వ్యవహరించినట్లు సమాచారం.....

## ప్లాటు అమ్మకానికి పెట్టడంతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం....

ఇటీవల షేక్ హుస్సేన్ బీ కుమార్తె రేష్మా బేగం కుటుంబ ఆర్థిక పరిస్థితులు, తల్లిదండ్రుల అనారోగ్య సమస్యల కారణంగా గతంలో కొనుగోలు చేసిన ప్లాటును విక్రయించాలని ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

అయితే ఆ స్థలం అసైన్డ్ భూమిలో ఉందని, ఇటువంటి భూమిని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రారని స్థానికులు చెప్పడంతో ఆమె ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైనట్లు బాధితులు తెలిపారు.

తమ తల్లిదండ్రులు మోసపోయారని గ్రహించిన రేష్మా బేగం, ఈ విషయమై ఇస్మాయిల్‌ను సంప్రదించగా తనతో అసభ్యకరంగా మాట్లాడారని ఆమె ఆరోపిస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాల్సిందిపోయి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు....

## సర్పంచ్‌ను ఆశ్రయించినా బెదిరింపులేనంటున్న బాధితులు...

ఈ వ్యవహారంలో న్యాయం చేయాలని కోరుతూ రేష్మా బేగం తన అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ తల్లిదండ్రులతో కలిసి స్థానిక సర్పంచ్‌ను కలిసినట్లు తెలిపారు. అయితే తమకు న్యాయం చేయాల్సింది పోయి అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు, మరోసారి ఆ ప్రాంతంలో కనిపిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనలతో బాధిత కుటుంబం తీవ్ర భయాందోళనకు గురవుతోందని వారు చెబుతున్నారు....

## పోలీసుల వద్ద ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన....

తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ తమ ఫిర్యాదును పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభావవంతమైన వ్యక్తులతో వివాదం పెట్టుకోవద్దని, ఇలాంటి ప్లాట్లను అనేక మందికి విక్రయించారని తమకు చెప్పినట్లు వారు వాపోతున్నారు. స్థానికంగా న్యాయం జరగదనే భావనతో వైరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదైన అనంతరం సంబంధిత వ్యక్తిని సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ అతడు పోలీసులకు అందుబాటులోకి రావడం లేదని వారు ఆరోపించారు....

## అర్ధరాత్రి ఫోన్ కాల్స్‌తో బెదిరింపులా?

తమపై కేసులు పెట్టినందుకు ఆగ్రహంతో ఇస్మాయిల్ అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. తన వెనుక స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ఉన్నారని, ఎన్ని కేసులు పెట్టినా తనను ఎవరూ ఏమీ చేయలేరని హెచ్చరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ బెదిరింపుల కారణంగా కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, తమకు, తమ వృద్ధ తల్లిదండ్రులకు రక్షణ కల్పించాలని రేష్మా బేగం కోరుతున్నారు....

## కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్...

అనారోగ్యంతో ఉన్న వృద్ధ తల్లిదండ్రులను వెంటబెట్టుకుని ఒక మహిళ న్యాయం కోసం చేస్తున్న పోరాటం స్థానికులను కలచివేస్తోందని పలువురు పేర్కొంటున్నారు. కోయచలక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 192లోని భూముల స్వభావం, అసైన్డ్ భూమి ఆరోపణలు, లేఅవుట్ అనుమతులు, ప్లాట్ల విక్రయాలు, బాధితుల వద్ద ఉన్న అగ్రిమెంట్లు, బెదిరింపు ఆరోపణలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, అక్రమంగా ప్లాట్లు విక్రయించారన్న ఆరోపణల్లో నిజానిజాలను వెలికితీసి, చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు....

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ తాతా మధుసూదన్ దిష్టిబొమ్మ దగ్ధం

**ఖమ్మం(జనం ముచ్చట)సెప్టెంబర్ 8:** రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు అడపా హారిక నాయుడు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు గజ్జెల్లి వెంకన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు....

ఈ సందర్భంగా బొడ్డు బొందయ్య మాట్లాడుతూ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని తీవ్రంగా బాధించాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన



స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగుతున్న వ్యక్తి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడటం సభ్య సమాజం తలదించుకునే పరిస్థితిని కల్పిస్తోందని ఆయన విమర్శించారు. ఇటువంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ, ఎస్సీ సెల్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు....

అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్‌పై తగిన చర్యలు తీసుకుని, ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని బొడ్డు బొందయ్య డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఆంతోటి సురేష్, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు కిలారు అనిల్ కుమార్, కొట్టే రాజశేఖర్, చింతమల్ల రవికుమార్, దామా స్వరూప తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయకులు బిక్షపతి రాథోడ్, ఏలూరి రవికుమార్, లింగాల రవికుమార్, కందుల శ్రీను, జంగాల లక్ష్మీనారాయణ, ఆరెంపుల రామయ్య, కందుకూరి వెంకటనారాయణ, తోళ్ళ రాకేష్, నారపోగు సుదర్శన్, తాళ్ల వెంకటేశ్వర్లు, పంది రాజు గౌడ్, మెలిక రాజు, బలుసు లక్ష్మీ, ఇటిక్యాల లత, చట్టు మంగ, కవిరాజు, మీసాల నరసింహారావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన తెలిపారు.

# తాత మధ అరెస్టుకు నిరసనగా.. కదంతొక్కిన మహిళలు

(మొదటి పేజీ తరువాయి)

దీనికి ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు....



**ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అరెస్టును ఉపసంహరించుకోవాలి....**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటి అమలును పక్కన పెట్టిందని కమల్ రాజు ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు, ప్రజల గొంతును అణచివేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టలేరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తాత మధు అరెస్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రజల గొంతుకను అణిచివేస్తే ప్రజాగ్రహమే....**

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని కమల్ రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజల గొంతును అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే అదే ప్రజాగ్రహం భవిష్యత్తులో మహా ఉద్యమంగా మారుతుందని అన్నారు. మధిరలో జరిగిన ఈ భారీ నిరసన ర్యాలీతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత మరోసారి వెలుగులోకి వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన వివిధ మండలాల మాజీ అధ్యక్షులు, మాజీ కార్యదర్శులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేంసూరులో బీఆర్ఎస్ పోరుబాట






**వేంసూరు (జనం ముచ్చట)సెప్టెంబర్ 8:** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఖండిస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో మర్లపాడులోని పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు వరకు నల్లజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ నిరసన కార్యక్రమంలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాలొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ విధానాలపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా చేసేందుకే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ శాసనసభ పట్ల, స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేశారు. స్పీకర్‌ను లేదా శాసనసభను అవమానించడం తమ పార్టీ ఉద్దేశం కాదని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ఉందని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ నాయకులు నల్ల దుస్తులు ధరించి అనేక సందర్భాల్లో నిరసనలు చేపట్టారని గుర్తు చేశారు. అయితే తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు నల్ల దుస్తులతో నిరసన తెలపడానికి ప్రయత్నిస్తేఎందుకుఅడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు.

అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెయ్యి రోజుల పాలనలో హామీలు ఏమయ్యాయి?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు స్కూటర్ల పంపిణీ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి హామీలను ప్రభుత్వం వెంటనే నెర వేర్చాలని

## కాంగ్రెస్ ప్రభుత్వంపై సండ్ర వెంకట వీరయ్య ఫైర్...

డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు. రైతు భరోసా, రైతు బీమా అమలుతో పాటు రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, దళితులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన అన్నారు....

ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఇక్కడితో ముగియదని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో నిరసన కార్యక్రమానికి తరలివచ్చిన మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను సంబంధిత అధికారులకు బీఆర్ఎస్ నాయకులు సమర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

---

## అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఖమ్మం జిల్లా

# అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

**హైదరాబాద్ (జనం ముచ్చట):**

అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలేరు పీఠం గురుస్వామి బజ్జూరి రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నాగ రామాచారి ఎన్నికయ్యారు.

హైదరాబాద్‌లోని చంపాపేట్ ఆడిటోరియంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీ య అధ్యక్షులు బ్రహ్మశ్రీ రాజ్ దేశ్ పాండే, జాతీ య ప్రధాన కార్యదర్శి కొండ దేవయ్య ఆధ్వ ర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖ గురు స్వాములు, అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. సమావేశంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘం గా చర్చించారు,వివిధ రాష్ట్రాల్లో కమిటీ విస్తరణ, అయ్యప్ప దీక్ష ప్రచార కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలతో పాటు సంస్థ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



అనంతరం జాతీయ, రాష్ట్ర నాయకుల సమక్షంలో వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు నూతన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు ఇతర బాధ్యులను ఎంపిక చేశారు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సీమ నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాండ రాంప్రసాద్ గురుస్వామి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడిగా నాగ రామాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బజ్జూరి రమణారెడ్డి (పాలేరు పీఠం గురుస్వామి) ఎన్నికైనట్లు ప్రకటించారు.బజ్జూరి రమణారెడ్డి ఎన్నిక పట్ల ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు అయ్యప్ప గురుస్వాములు, అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు. వారి నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించబడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.నూతనంగా ఎన్నికైన నాగ రామాచారి, బజ్జూరి రమణారెడ్డిలకు అయ్యప్ప గురుస్వాములు, భక్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలు, భక్తుల సంక్షేమం, దీక్ష ప్రచార కార్యక్రమాల విస్తరణకు నూతన కమిటీ కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

---

## తాత మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి: అర్వికట్ల ప్రేమ్ కుమార్...

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):**



స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని తీవ్రంగా బాధించాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అర్వికట్ల ప్రేమ్ కుమార్ ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమన్నారు, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# ఖమ్మంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై..

# టీఆర్ఎస్ నాయకుల ఫైర్

**అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వ వ్యవహారశైలిని ఖండిస్తూ నిరసన**



ఖమ్మం సిటీ (జనం ముచ్చట):
కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల కార్యాచరణలో భాగంగా చివరి రోజు మంగళవారం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ గ్రంథాలయ చైర్మన్ కమర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాటలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని అన్నారు. గ్రామాల్లోకి వెళ్తే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీసే పరిస్థితి ఏర్పడిందని, ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలని సూచించారు.

**మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరు అత్యంత అవమానకరం**

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును వారు తీవ్రంగా ఖండించారు. నిన్న అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు యావత్ తెలంగాణ ప్రజానీకం తలదించుకునేలా చేసింది. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల వ్యవహరించిన తీరు మహిళా సమాజాన్ని కించపరిచే విధంగా ఉందిలి" అని మండిపడ్డారు.

అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నలు అడుగుతుంటే వాటికి సమాధానం చెప్పకుండా సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం అనవసరమైన డ్రామాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

**అర్ధరాత్రి అరెస్టులు.. కక్షపూరిత కేసులు పెట్టడం సరికాదు**

తెల్లవారుజామున బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం, వారిపై కక్షపూరితంగా కేసులు నమోదు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ప్రతిపక్ష నాయకులు బయటికి రావాలని, ర్యాలీలు నిర్వహించాలని పిలుపునివ్వడం బహుశా ఈ దేశ రాజకీయ చరిత్రలోనే ఒక ముఖ్యమంత్రి ఆలోచించని దిక్కుమాలిన ఆలోచన. ప్రజల తరఫున ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే, వాటిని తట్టుకోలేక ప్రభుత్వం ఇలాంటి వెకిలి చేష్టలకు పాల్పడుతోందిలి" అని విమర్శించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని, ప్రజల గొంతుకగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయాలని, ప్రజలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లిమాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్, మాజీ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు శీలంశెట్టి వీరభద్రం, పల్లా రోజ్‌లీనా, దండా జ్యోతి రెడ్డి, బుడిగం శ్రీను మచ్చ నరేందర్, కనకం, పాలడుగు పాపారావు, భద్రయ్య, మాజీ కౌన్సిలర్లు కొప్పెర నరసింహారావు, జక్కుల లక్ష్మయ్య,దడాల రఘు, జేఏసీ నాయకులు బిచ్చల తిరుమలరావు, మేకల సుగుణ రావు ,మాజీ నగర యూత్ అధ్యక్షుడు దేవబక్తిని కిషోర్ ,మాటూరి లక్ష్మినారాయణ ,షకీన తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# గోదావరి, సాగర్ జలాలను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలి**

**జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

**కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహంపై నిరంతరం అప్రమత్తం గా ఉండాలి**

**పల్లెగూడెం ఎన్ఎస్పి కాలువ పునరుద్ధరణ పనులు, వి.వి. పాలెం డీప్‌కట్ వద్ద జలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



ఖమ్మం సిటీ (జనం ముచ్చట):
సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతతో కాపాడుకోవాలని, రైతులు నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాల్వ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ జలాల ప్రవాహాన్ని పరిశీలించి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ, తూము మరమ్మత్తు పనుల పై మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలువ పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీటి సాఫీగా ప్రవహించేందుకు అనువైన పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరితగతిన కాలువ, తూము పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని, త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పై ఆరా తీశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఒక్కరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరిని హియరింగ్ కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సైతం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద జలాల పరిస్థితిని పరిశీలించారు. అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని అన్నారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇర్రిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తో పాటు పలువురు మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.